# బాలిక కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్టు

విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 24: ఐదేళ్ల బాలికను కిడ్నాప్ చేసి విక్రయించిన ఐదుగురు సభ్యుల ముఠాను చాంద్రాయణగుట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. వీరి వద్ద నుంచి బాలికను సురక్షితంగా కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. గురువారం చాంద్రాయణ గుట్ట పోలీస్‌స్టేషన్లో తూర్పు దక్షిణ మండల డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాశ్, ఏసీపీ మనోజ్‌కుమార్, సీఐ గురునాథ్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. పాతబస్తీ సలీంనగర్‌లో నివసించే సయ్యద్ జావిద్ పాషా(51), షాయిస్త పర్వీన్(40)భార్యాభర్తలు. వీరు ఈనెల 20వ తేదీన చాంద్రాయణ గుట్ట భ్రమరాంబ వయసు సమీపంలో బాలిక(5)ను కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ బాలికను ఉప్పల్‌లో నివసించే పర్వీన్ రూ.లక్ష 30వేలకు విక్రయించారు. బాలిక కిడ్నాప్‌పై ఫిర్యాదు అందుకున్న చాంద్రాయణగుట్ట పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా గురువారం కిడ్నాప్‌నకు పాల్పడ్డ జావీద్, శాయిస్త పర్వీన్ దంపతులను పట్టుకున్నారు. వీరు ఇచ్చిన సమాచారంతో పాపను కొనుగోలు చేసిన పర్వీను, పాపను అమ్మడంలో పాలుపంచుకున్న సుజాత, రాజేంద్రప్రసాద్‌ను కూడా పట్టుకున్నారు. సుజాత రాజేంద్రప్రసాద్‌లు ముంబైలో కూడా చిన్న పిల్లల విక్రయంలో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ఐదుగురిని పట్టుకున్న పోలీసులు, వీరి వద్ద నుంచి బాలికను సురక్షితంగా కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు కేసు దర్యాప్తులో ఉంది. కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులను డీసీపీ అభినందించారు.

# మౌలాలీలో సీసీ రోడ్డు నిర్మాణం

## జేఆర్‌టీఐ జంక్షన్ సమీపంలో ట్రాఫిక్ మళ్లింపు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ): మౌలాలీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో మల్కాజిగిరి ట్రాఫిక్ ఠాణా పరిధిలోని గోపాల్‌నగర్ నుంచి స్పింగ్ హస్పిటల్ వరకు నెల రోజులపాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఈ మేరకు ఈసీఐఎల్ వైపు నుంచి తార్నాకకు వచ్చే వాహనాలను రామాదేవి సిగ్నల్ వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలను హెచ్‌బీ కాలనీ, యూనాని ఆసుపత్రి, ఎన్టీర్ విగ్రహం జేఆర్‌టీఐ వై జంక్షన్ నుంచి తార్నాక వైపు వెళ్లాలి. అలాగే తార్నాక వై పుంచి వచ్చే వాహనాలను జేఆర్‌టీఐ వై జంక్షన్ వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలను ఎన్టీఆర్ విగ్రహం, యూనాని దవాఖాన, హెచ్‌బీ కాలనీ, రామాదేవి సిగ్నల్ మీదుగా ఈసీఐఎల్ వైపు వెళ్లాలని సూచించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా, చందానగర్ బ్రాంచ్, విజయలక్ష్మి కాంప్లెక్స్, NH బస్టాప్ దగ్గర, చందానగర్ బస్టాప్ ఎదురుగా, హైదరాబాద్-500 050. T.G., ఫోన్: 040-23030966/8367788529.

లాకర్ పగులగొట్టి తెరచుట

బ్యాంక్ ఆఫ్ బరోడా, చందానగర్ బ్రాంచ్, హైదరాబాద్‌లో లాకర్లను అద్దెకు తీసుకుని, ఒప్పందాన్ని ఉల్లంఘించిన మావిలువైన పోషకుల సమాచారం ఇది. RBI/బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం వారి నమోదు చేయబడిన చిరునామాలలో అద్దెదారులకు పంపబడిన నోటీసులు, వ్యక్తులు/చిరునామాలు కనుగొనబడలేదు లేదా వదిలివేయబడినవిగా పేర్కొంటూ బట్వాడా చేయబడలేదు. లాకర్ హోల్డర్లను వారి రికార్డు చేసిన చిరునామాలలో వ్యక్తిగతంగా సంప్రదించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు మరియు వారి ప్రస్తుత ఆచూకీ కనుగొనబడలేదు. అందువల్ల, ప్రత్యామ్నాయం లేకుండా క్రింద పేర్కొన్న వ్యక్తులందరికీ బ్రాంచ్‌ను సంప్రదించడానికి మరియు 3 నెలల వ్యవధిలో బ్యాంక్ బకాయిలను క్లియర్ చేయడానికి నోటీసు ఇవ్వడమైనది. లేనిపక్షంలో, 25-07-2025 ఉదయం 11.00 గంటలకు లాకర్లను తెరిచేందుకు బ్యాంక్ వారి ఖర్చు, రిస్క్ మరియు బాధ్యతతో ముందుకు సాగుతుంది మరియు బ్యాంక్ అద్దె చెల్లించే హక్కును వినియోగించుకుంటుంది.

| బ్రాంచ్ పేరు | రుణగ్రహీత పేరు | లాకర్ రకం | లాకర్ నెంబర్ | బకాయి మొత్తం రూ.లలో |
|---|---|---|---|---|
| చందానగర్ | ఎం.వెంకటేష్ | A | 8969AX0011 | 11151 |
| చందానగర్ | సాంబశివరావు | A | 8969AX0022 | 11151 |
| చందానగర్ | ప్రసాద్ బుక్ సెంటర్ | A | 8969AX0079 | 17198 |
| చందానగర్ | బి.చంద్రకళ | A | 8969AX0299 | 12363 |
| చందానగర్ | జి.వి. లక్ష్మి | A | 8969AX0300 | 14396 |
| చందానగర్ | మోతియా రాణి | A | 8969AX0315 | 16874 |
| చందానగర్ | శాంతి కుమార్ .ఎస్ | A | 8969AX0575 | 14573 |
| చందానగర్ | వెంకటేష్ .పి | C | 8969CX0078 | 19164.67 |

తేది: 25-04-2025 సం/- బ్రాంచ్ మేనేజర్

# ఇంట్లో.. బయట చెప్పరు

- మోసానికి ముందు.. మోసం తరువాత అదే పరిస్థితి
- గుట్టుగా సంపాదిద్దామని ఊబిలోకి..
- ఈజీగా నమ్మేస్తున్న సైబర్ బాధితులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ) ట్రేడింగ్ చేస్తే మంచి లాభాలొస్తున్నాయంటూ ఒకరు.. క్రిప్టో కరెన్సీలో లాభాలంటూ మరొకరు.. పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తే గంటకు వేలు సంపాదించవచ్చంటూ ఇలా.. లోన్ ఇప్పిస్తామని..పెండ్లి చేసుకుంటానంటూ ఇలా ఒక్కొక్కరు ఒక్కో రకంగా సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. అయితే ఇంత జరుగుతున్నా బాధితులు కనీసం మొదట ఇది నిజమా? అబద్ధమా? అనే విషయంపై కనీస చర్చ జరగడం లేదు. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు ఇలా కనీసం ఎవరితోనో ఒకరితో ఫలాన ఇలా ఆఫర్ ఉంది? ఎలా ఉంటుంది?అనే విషయంపై చర్చిస్తే కనీసం ఎవరో ఒకరు దానిపై అవగాహన ఉండి అదంతా ఛీటింగ్ అని చెప్పే అవకాశాలుంటాయి. కానీ సైబర్‌నేరగాళ్లు వేసే వలలో ఈజీగా చిక్కుకొని అత్యాశకు పోయి నిండా మునిగిపోతున్నారు. ఇది తమకొక్కరికే తెలుసు అనే భావనతో ఇతరులతో చర్చించకుండా ఊబిలో చిక్కుకుంటున్నారు. మోసపోయిన తరువాత కూడా ఎవరికీ చెప్పుకోలేని దుస్థితిలో ఉంటున్నారు. బయట తెలిస్తే ఎవరేమనుకుంటారో అనే ఆందోళనలో ఉంటున్నారు. ఇలా సైబర్ క్రైమ్ బాధితులు ఘటనకు ముందు, తరువాత ఏ విషయం చెప్పుకోలేకపోవడం గమనార్హం. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పేది ఎంత వరకు నిజం అనే విషయంపై కనీసం కుటుంబసభ్యులతోనైనా చర్చించాల్సిన అవసరం ఉంటుంది. గుడ్డిగా ఇంటర్‌నెట్‌లో ఎవరో పంపించిన మెసేజ్‌లను నమ్మేసి లక్షలు, కోట్లు మోసపోతున్నారని పోలీసులు చెబుతున్నారు.

**మాటలే మోసగాళ్ల పెట్టుబడి..**

సైబర్ మోసాలలో సైబర్ నేరగాళ్లు చెప్పే మాటలే వారి పెట్టుబడి. మొదట్లో మాటలు చెప్పి అమాయకులను బుట్టలో వేశారంటే ఆ తరువాత బాధితుడే అందులో కూరుకుపోయి డబ్బులు పెట్టుబడి పెడుతూ మోసానికి గురవుతుంటాడు. ఇందుకు మొదట మాటలు, ఆ తరువాత వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్‌లలో పార్ట్‌టైమ్, క్రిప్టో, ట్రేడింగ్ అంటూ నిష్ణాతులైన వారితో చర్చలు, సూచనలంటూ మాయ మాటలు చెబుతుంటారు. డబ్బులు ఇచ్చిన తరువాత నుంచి నెమ్మదిగా మోసంలోకి దింపుతుంటారు. ప్రధానంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, సోషల్‌మీడియా గ్రూప్‌లో ట్రేడింగ్ గూర్చి చర్చలు జరిపి అమాయకులను మోసం చేస్తుండటంతో ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

**అత్యాశతోనే ఎక్కువ మోసం..**

ఎవరికి చెప్పకుండా మోసపోవడం, మోస పోయిన తరువాత కూడా ఎవరికి చెప్పుకోలేని వారిలో వంద శాతం అత్యాశకుపోవడంతోనే మోసపోతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పక్కింట్లో ఉండే వారికి చెబితే వాళ్లు కూడా మనను అనుసరించే అవకాశాలున్నాయని, నాకే డబ్బు కావాలనే భావనతో కొందరు ఉంటూ తమ ఖాతాలను తామే ఖాళీ చేసుకునే పరిస్థితి తెచ్చుకుంటున్నారు. ఇంటర్‌నెట్‌లో డబ్బు ప్రస్తావన వచ్చిందంటే అది మోసమనే గుర్తించుకోవాలని, అత్యాశకుపోయి మునిగిపోవద్దంటూ పోలీసులు సూచిస్తున్నారు.

# ఆభరణాల రూపంలో సగమే బంగారం

## పోలీసులను ఆశ్రయించిన జ్యువెల్లరీస్ నిర్వాహకుడు

ఖైరతాబాద్, ఏప్రిల్ 24: బంగారం షాపులో విక్రయించిన ఆభరణాలలో సగమే బంగారం ఉండటంతో నిర్వాహకుడు కంగుతిన్నాడు. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... అమీర్‌పేట్ లాల్ బంగ్లా వద్ద ఉన్న సిద్ధి జ్యువెల్లర్స్‌కు ఓవ్యక్తి బంగారం విక్రయించేందుకు వచ్చాడు. సుమారు 980 గ్రాముల బంగారాన్ని విక్రయించి రూ.40లక్షలు తీసుకొని వెళ్లాడు. ఆ తర్వాత బంగారం నాణ్యతను పరీక్షించగా, 270 గ్రాములు మాత్రమే బంగారం ఉండటంతో నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి

- వెయ్యి మందితో త్వరలో ఆమరణ దీక్ష
- బీసీ సంఘాల హెచ్చరిక
- జాతీయ బీసీ సంక్షేం సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘం నేతలు నీల వెంకటేశ్, జి.అంజి తదితరులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 24: బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని, లేకపోతే యుద్ధం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు(ఎంపీ) ఆర్.కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గురువారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించడం చాలా దారుణమని, బీసీలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు బీసీలను బలి చేసిందన్నారు. త్వరలో వెయ్యి మందితో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని ఆయన వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 12 నెలల కిందట జరపాల్సిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్ల గురించి వాయిదా పడుతూ జాప్యం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాకముందే మంత్రి సీతక్క స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడం బీసీలను మరోసారి మోసం చేయడానికి కుట్ర పన్నుతున్నదని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఒక వేళ రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలకు వెళితే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందన్నారు. ఏ మంత్రిని, ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను 20శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేసి, ఇంతవరకు ప్రభుత్వం జీవో ఎందుకు జారీ చేయలేదని ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని 73, 74 రాజ్యాంగ సవరణ చేసినప్పుడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి-6 ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచే అధికారం ఉందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపునకు కచ్చితంగా రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు జి.అంజి, మణికంఠ, రాజునేత, నరసింహాగౌడ్, రవి కుమార్, ఎస్.లక్ష్మీనారాయణ, ఫణి పాల్గొన్నారు.

# చోరీ కేసులో గజదొంగ అరెస్టు.. పరారీలో మరో నిందితుడు

జీడిమెట్ల, ఏప్రిల్ 24: ఇంట్లో ఎవరూలేని సమయంలో కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లిన గజ దొంగను జీడిమెట్ల పోలీసులు గురువారం అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న రూ.11.5లక్షల సొత్తు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్, డీఐ కనకయ్య వివరాలు వెల్లడించారు. అపురూపకాలనీకి చెందిన పింటూ అనే వ్యక్తి మార్చి 5వ తేదీన కుటుంబసభ్యులతో కలిసి వారి సొంతూరికి వెళ్లాడు. మరునాడు ఉదయం సీసీ కెమెరాలను పరిశీలించిన పింటూ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే విషయాన్ని పింటూ బావ మరిదికి తెలుపగా.. అతడు ఈ విషయమై 6వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దొంగతనం చేసిన వ్యక్తి బేగరి వేణుగోపాల్‌పై 44 కేసులు పీడీ యాక్టు ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 150 సీసీ కెమెరాలను పరిశీలించడంతోపాటు కొన్ని టెక్నికల్ ఆధారాలతో దొంగతనం చేసిన వ్యక్తి వేణుగోపాల్(26), సంపత్ సాయి (20)గా గుర్తించారు. బుధవారం సాయంత్రం వేణుగోపాల్‌ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.11.5లక్షల విలువజేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, మరో నిందితుడు సంపత్‌సాయి పరారీలో ఉన్నాడు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి వేణుగోపాల్‌ను రిమాండ్‌కు తరలించారు. కాగా, వేణుగోపాల్ సైబరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే 44 కేసుల్లో నిందితుడిగా ఉండగా.. గతంలో దుండిగల్ పీఎస్ నుంచి పీడీ యాక్టు ద్వారా సంవత్సరం జైలు శిక్ష అనుభవించాడు. జీడిమెట్ల పోలీసులు సైతం వేణుగోపాల్‌పై పీడీయాక్టు కోసం రెకమండ్ చేశారు.

## రూ.8.50లక్షలు దోచుకున్న కిలాడీలేడి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 24: ప్రత్యేకమైన కాయిన్ మార్కెట్‌లో అమ్మితే కోట్లు వస్తాయని ఓ మహిళను నమ్మించి నట్టేట ముంచిన ఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ప్రత్యేకమైన కాయిన్ తయారు చేయడానికి దాదాపు రూ.4.50లక్షలు అవుతుందంటూ ఆమెకు మాయమాటలు చెప్పి దాదాపు రూ.8.50లక్షలు దోచుకున్న కిలాడీలేడి. ఇప్పుడు దిక్కున్న చోట చెప్పుకో అంటూ బెదిరింపులకు పాల్పడుండటంతో బాధిత మహిళ శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఆశ్రయించింది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సాతంరాయి ప్రాంతానికి చెందిన అరుణ(35)టైలర్‌గా పని చేస్తూ భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటుంది. పక్కనే ఉండే చందు అనే వ్యక్తి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలొస్తాయంటూ నమ్మించాడు.దీంతో ఆ మహిళ గత అక్టోబర్ నెలలో మొదట రూ.50వేలు చందు ఆధ్వర్యంలో వెంకట్ అనే మరో వ్యక్తికి ఇచ్చింది. మరోసారి రూ.2లక్షలు పెట్టుబడి పెడితే రూ.10లక్షలు వస్తాయి. రూ.50వేలకు ఏం రాదు అంటూ చెప్పడంతో 15రోజుల తర్వాత మరో రూ.50వేల వెంకట్‌కు ఇచ్చినట్లు తెలిపారు. డబ్బు ఇవ్వకపోవడంతో చందుని బాధిత మహిళ అడిగింది. దీంతో చందు మీరు ఇచ్చిన డబ్బులు వెంకట్ తీసుకెళ్లాడని, మీరు పెట్టుబడి పెడుతానంటే మీకు అసలైన వ్యక్తిని పరిచయం చేస్తానని, కర్నాటక రాష్ట్రంలోని మైసూర్‌కు చెందిన లక్ష్మీని చందు ఫోన్‌లో పరిచయం చేశాడు. లక్ష్మిని కలిసేందుకు హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణహోటల్‌కు కొద్దిదూరంలో ఉన్న కాఫీ షాపులో కలిశారు. బిజినెస్ కాయిన్ తయారు చేస్తే అధిక డబ్బులకు అమ్ముచ్చని పలు వీడియోలు ఫోన్‌లో చూపించింది. దీని తయారీకి రూ.4.50లక్షలు ఖర్చు అవుతుందని,రూ.50లక్షల నుంచి కోటి లాభం వస్తుందని నమ్మించింది. దీంతో బాధిత మహిళ మొదటగా అక్కడే రూ.90వేల నగదు ఇచ్చింది. మిగతావి దఫాదఫాలుగా ఫోన్‌పే ద్వారా ఆన్‌లైన్‌లో పంపింది. నువ్వు ఇవ్వకుంటే పెట్టిన డబ్బులు పోతాయని మాయమాటలు చెప్పడంతో డబ్బులు రావేమోనని నమ్మిన బాధిత మహిళ ఫోన్‌పే ద్వారా రూ.10వేలు, 20వేలు, 50వేలు ఇలా విడతలుగా దాదాపు రూ.8.50లక్షల ఫోన్‌పే ద్వారా చెల్లించగా..రోజులు గడిచినా డబ్బులు రావడంలేదు. మోసపోయినట్లు గ్రహించింది. గత శనివారం ఎయిర్‌పోర్టులోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు వచ్చిన లక్ష్మిని పట్టుకునేందుకు బాధిత మహిళ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. అక్కడ నేను నీకు డబ్బులు ఇస్తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇద్దరికి నష్టమని ఆమెను నమ్మించి అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయింది. దీంతో బాధిత మహిళ గురువారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆ సూట్ కేసుల్లో ఏమున్నాయి?

- పటాకుల కేసు నీరుగార్చేలా..
- వైద్యాధికారి ఫిర్యాదు చేసినా..పట్టించుకోని పోలీసులు, నిమ్స్ యాజమాన్యం
- అంతర్గత విచారణపై యాజమాన్యం మీనమేషాలు?

ఖైరతాబాద్, ఏప్రిల్ 24:నిమ్స్‌లో భద్రతా వైఫల్యాన్ని వెలుగులోకి తెచ్చిన పటాకుల కేసును కొందరు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైద్యాధికారి దానిని అబద్ధం చేసేందుకు ప్రయత్నిస్తుండగా, అదే హోదాలో ఉన్న మరో వైద్యాధికారి అది నిజమంటూ సాక్షాధారాలను సైతం నిమ్స్ యాజమాన్యం, పోలీసుల ముందు ఉంచారు. స్వయంగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, పూర్తి స్థాయిలో సాక్షాలను ముందుంచినా.. ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఎందుకు ఆదేశించడంలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ కేసును కొందరు అమాయకులపై నెట్టివేసే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు జరుగుతున్నది. మరో వైపు ఈ కేసును పూర్తిగా నీరుగార్చేందుకు పోలీసులపై పలు రకాల ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వంలోని పెద్దలకు సంబంధించిన కొందరు నిమ్స్ వ్యవహారంలో తలదూర్చి బాధ్యులైన వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

**ఆ గంటలోనే మారిన సీన్**

నిమ్స్ దవాఖానలో అగ్ని ప్రమాదం జరిగిన కొన్ని గంటల తర్వాత పంజాగుట్ట పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఐదో అంతస్తులోని ఓ వైద్యాధికారితో పంజాగుట్ట పోలీసు అధికారి ఒకరు గంట సేపు అతని గదిలో విచారణ పేరిట మాట్లాడారు. కేసులో అనేక మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తున్నది.అంతలోనే పటాకులు మాయం కావడం, ఆరోగ్యశ్రీ కార్యాలయం సిబ్బందిని అనుమానించడం, కేసు పోలీస్‌స్టేషన్‌కు చేరడం చకచకా జరిగిపోయాయి. వారిద్దరి మధ్య ఏం సంభాషణ జరిగింది. పటాకులు ఎందుకు మాయమయ్యాయి. కేసు ముందుకు ఎందుకు సాగడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిమ్స్ దవాఖాన ప్రతిష్టను కాపాడేందుకు ఓ అధికారి ధైర్యం చేసి యాజమాన్యం, పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇద్దరూ పట్టించుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**పటాకుల వెంట ఉన్న సూట్ కేసులు ఎక్కడ?**

నిమ్స్ ఎమర్జెన్సీ వార్డు ఐదో అంతస్తులోని ఆడిటోరియంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పటాకులతోపాటు దాని పక్కనే పెద్దపెద్ద సూట్ కేసులు దర్శనమిచ్చాయి. పటాకులతోపాటు సూట్ కేసులు సైతం మాయమయ్యాయి. అసలు ఆ సూట్ కేసుల్లో ఏముంది? ఎక్కడ దాచారు.. ఎవరు దాచారు.. ఎందుకు దాచారో.. తేలాల్సి ఉందంటున్నారు. దేశంలోనే అత్యుత్తమ ఆస్పత్రుల్లో ఒకటిగా నిలిచిన నిమ్స్ దవాఖానలో ఇలాంటి సంఘటనలు వరుసగా చోటుచేసుకోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా కేసును పారదర్శకంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నిలోఫర్‌లో అదుపు తప్పిన పాలన

మొదటి పేజీ తరువాయి..

సంబంధించిన ఇండెంట్‌ను ఎప్పటికప్పుడు సంబంధిత నర్సింగ్ అధికారులు, ఆర్ఎంఒలు, వైద్యాధికారులు సరిచూసుకోవాల్సి ఉంటుంది. కాని పెద్ద మొత్తంలో మందులు మాయమవుతున్నా ఇప్పటి వరకు సమాచారం బయటకు రాలేదంటే ఈ చోరీ వ్యవహారంలో మరికొంత మంది సిబ్బంది హస్తం కూడా ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఫిర్యాదు చేయడంలో మీనామేషాలు**

ఈనెల 22న రాత్రి మందులను తస్కరించిన లిఫ్ట్ ఆపరేటర్‌ను దవాఖానలో ఉన్న స్పెషల్ పోలీసులు పట్టుకుని, దవాఖాన అధికారులకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంలో దవాఖాన అధికారులు మీనామేశాలు లెక్కించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తి వివరాలతో సూపరింటెండెంట్ ద్వారా ఫిర్యాదు ఇప్పించాలని పోలీసులు చెప్పడంతో ఎట్టకేలకు దవాఖాన అధికారులు గురువారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు జరిగిన ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాంపల్లి పోలీసులు వెల్లడించారు. కాగా ఎఫ్ఐఆర్ కాపీ తనకు ఇంకా రాలేదని, వచ్చిన తరువాత మందుల దొంగతనానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామంటూ దవాఖాన సూపరింటెండెంట్ కేసు వివరాలు వెల్లడించకుండా దాటవేయడం గమనార్హం.

# మంత్రి పొంగులేటి పీఏను అంటూ మోసం.. ఇద్దరి అరెస్ట్

మన్సూరాబాద్, ఏప్రిల్ 12: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏను అంటూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని రెండు వేర్వేరు కేసుల్లో నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా, చిల్పూర్ మండలం, పల్లగుట్ట గ్రామానికి చెందిన మాచ సురేశ్(30) ప్రస్తుతం నాగోల్, వెంకట్ రెడ్డినగర్ కాలనీలో నివాసముంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మాచ సురేశ్ గత కొంతకాలంగా సెల్ నంబర్: 90309 31213 ద్వారా కొందరు అధికారులకు ఫోన్లు చేసి తాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏను అంటూ పరిచయం చేసుకొని పని చేసిపెట్టాలని కోరాడు. గత నెల మార్చి 29న చౌటుప్పల్ సీఐకి ఫోన్ చేసి అనుమానాస్పదరీతిలో మృతి చెందిన ఓ మహిళ పోస్టుమార్టం రిపోర్ట్ కావాలని అడిగాడు. తాండూర్ సీఐకి ఫోన్ చేసి భూ తగాదాల్లో అరెస్టు చేసిన వ్యక్తులకు అనుకూలంగా కేసు నమోదు చేయాలని కోరాడు. నార్సింగ్ సీఐకి ఫోన్ చేసి సివిల్ కేసులో తమ వారికి అనుకూలంగా పనిచేయాలని కోరాడు. సికింద్రాబాద్ రీజియన్ జేబీఎస్ పర్సనల్ ఆఫీసర్‌కి ఫోన్ చేసి డ్రైవర్ ట్రాన్స్ఫర్ విషయం.. ఘట్కేసర్ ఎక్సైజ్ సీఐకి ఫోన్ చేసి గంజాయి కేసులో పట్టుబడిన వాహనాన్ని విడుదల చేయాలని, కాలేజ్ సీట్ విషయంలో జాహ్నవి డిగ్రీ కాలేజీ యాజమాన్యానికి, యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కి ఫోన్ చేసి పర్సనల్ లోన్ రూ.10లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశాడు. మాచ సురేశ్ ప్రవర్తనపై అనుమానాలు కలిగిన సంబంధిత అధికారులు అతడి వివరాలను సేకరించగా.. అలాంటి వ్యక్తి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వద్ద ఎవరు పీఏగా పని చేయడంలేదని తేలింది. అదేవిధంగా మరో కేసులో భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం, గ్రామానికి చెందిన బుస వెంకట్ రెడ్డి(34) ప్రస్తుతం నాగోల్, మమతా నగర్ కాలనీలో నివాసం ఉంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీఏ అంటూ ప్రచారం చేసుకున్నాడు. బుస వెంకటరెడ్డి వ్యవహారంపై అనుమానం కలిగి మంత్రి డీపీఓ(డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్)గా పనిచేస్తున్న పేరాల నరేశ్‌కి సమాచారమిచ్చారు. మాచ సురేశ్, బుస వెంకట్రెడ్డి అనే వ్యక్తులు ఎవరూ మంత్రి పొంగులేటి వద్ద పీఏలుగా పనిచేయడంలేదని నరేశ్ సమాచారం ఇచ్చాడు. నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మోసాలకు పాల్పడ్డ మాచ సురేశ్, బుస వెంకటరెడ్డిలను నాగ